## అడల్ట్స్ ఓన్లీ కథ A

# రసగుళిక

**ఆకునూరి మురళీకృష్ణ**

శృంగారానికి కావాల్సిన ప్రేరణని జీవితాన్నుంచి, జీవితానికి కావాల్సిన ప్రేరణని శృంగారం నుంచి పొందగలిగితే, జీవితంలో 'రొటీన్' అన్న పదానికి తావుండదు!

★ ★ ★

చాలారోజుల తర్వాత మొదటి రాత్రి అనుభవించిన ఉద్వేగాన్ని అనుభవిస్తున్నాడు విష్ణు.

'చక్రవర్తి ఇచ్చిన గుళికలు జేబులో వుంచుకుంటేనే ఇంతలా పనిచేస్తున్నాయి. ఇంక నిజంగా మింగితే ఎలా వుంటుందో' అనుకున్నాడు నవ్వుకుంటూ.

'అదృష్టవశాత్తూ సమయానికి పిల్లలు కూడా వాళ్ళ అమ్మమ్మ వాళ్ళ ఊరు వెళ్ళారు. ఇంక ఈరోజు మన్మథ సామ్రాజ్యంలో తనకే అడ్డూ వుండదు' ఆనందంగా అనుకున్నాడు.

దాదాపుగా నాలుగు సంవత్సరాల నుంచీ నిస్సారంగా గడుస్తున్న తమ సంసార జీవితం గుర్తొచ్చింది.

శృంగారం మనిషికి దేవుడిచ్చిన వరం అంటారు. రోజంతా అలసి సొలసిన శరీరాలు సేద తీరి కొత్తశక్తిని సంతరించుకునేది శృంగార సేవలోనే అని కవులూ రచయితలూ రాస్తూ వుంటారు.

కానీ తన జీవితంలో రాను రాను పిల్లలు పుట్టడం, కుటుంబ బాధ్యతలు పెరిగిపోవడంతో సంసారంలో శృంగారం పాలు తక్కువైపోయి జీవితం చక్కెరలేని పాలలా చప్పగా అనిపిస్తోంది.




పైకి చెప్పకపోయినా తన భార్య ప్రియకి కూడా అదే ఫీలింగ్ వుంది.

పెళ్ళైన కొత్తలో శృంగారాన్ని ఎంత బాగా ఎంజాయ్ చేసినా తాము రాను రాను ఇలా ఎందుకు తయారయ్యారు?

లోపం ఎక్కడుంది?

మీద పడుతున్న వయసులోనా?

'వయసుకీ శృంగారానికీ సంబంధం లేదంటాడు' తన ఫ్రెండ్ చక్రవర్తి. అతడే చెప్పాడు తనకీ 'రసగుళిక' సంగతి కూడా. ఈ గుళిక మింగితే ఎంత వయసు మీద పడిన వారికైనా శృంగార భావనలు కలుగక మానవట!

తనకోసం కష్టపడి సంపాదించి తీసుకొచ్చి ఇచ్చాడు వాటిని, తన మ్యారేజ్‌డే గిఫ్ట్‌గా.

చాలా రోజుల తర్వాత పువ్వులు, స్వీట్లు తీసుకొచ్చిన విష్ణుని ఆశ్చర్యంగా చూసింది ప్రియ.


''ఇన్ని స్వీట్స్ ఎందుకు తెచ్చారండీ. పిల్లలు కూడా లేరు తినడానికి'' అందామె.

''ఇవన్నీ పిల్లల కోసం కాదోయ్.. మనకోసమే! మొదటిరాత్రిలా ఇవాళ కూడా చాలాసేపు మెలకువగా వుండాలి కదా'' అంటూ కన్నుగీటాడు.

మొదటి రాత్రిని గుర్తుచేయడంతో ప్రియ బుగ్గలు ఎర్రబడ్డాయి. విష్ణు చక్రవర్తి

## దురదృష్టం

రాకరాక అవకాశాలు వచ్చి అవి వెంటనే పోతే ఎలా ఉంటుంది? రక్షిత ఇప్పుడు ఈ స్థితిలోనే ఉంది. ఎందుకంటే నీలకంఠ దర్శకత్వంలోని 'సదా మీ సేవలో' సినిమాకి హీరోయిన్‌గా ఎంపికైన రక్షిత లావు కారణంగా తన అవకాశాన్ని పోగొట్టుకుంది. 'నేను లావుగా ఉన్నానని అంతా అంటున్నారు. మునుపటితో పోలిస్తే నేను లావుగా ఉన్నమాట వాస్తవమే. అయితే ఏ కారణం చేత నన్ను తొలగించారో అర్థం కావడంలేదు' అంటోంది రక్షిత. షూటింగ్ లేనప్పుడు వంటిపై శ్రద్ధ చూపితే ఇలాంటి చిక్కులు ఉండవు కదా అని అంతా సలహా ఇస్తున్నారు. అన్నట్టు ఈమె స్థానంలో శ్రీయ ఆ ఛాన్స్ కొట్టేసింది.



ఇచ్చిన రసగుళికలని తీసి భద్రంగా బీరువాలో వుంచాడు. వాటి సంగతి ప్రియకి చెప్పదలుకోలేదు. చాలా రోజుల తర్వాత ఆమెకి ఆ అనుభవం లోని తీయదనాన్ని సర్‌ప్రైజింగ్‌గా రుచి చూపించాలనుకున్నాడు.

అతను చెప్పినదాని ప్రకారం రాత్రి భోజనం కాగానే ఒక్క మాత్ర తను మాత్రం వేసుకుంటే చాలు...

స్నానం చేసి ఇస్త్రీ లాల్చీ పైజమా వేసుకున్నాడు.

ప్రియ కూడా స్నానం చేసి తెల్లటి కాటన్ చీర కట్టుకుని జడలో మల్లెపూలూ, సంపెంగలూ పెట్టుకుని ముస్తాబయింది.

ఆమె మంచి పొడగరి. ఎక్కడి అవయవాలక్కడ అమరినట్లు వుంటాయి. ముప్పై పైబడిన స్త్రీలలో సహజంగానే ప్రవేశించే కొత్త అందాలు ఆమెలో కూడా కనిపిస్తున్నాయి.

''ఏవండీ.. ఇవాళ మన పెళ్ళి రోజు కదా, గుడికి వెళ్ళొద్దామండీ'' అందామె.

మామూలుగా అయితే ''అలసిపోయానోయ్.. ఇపుడు రాలేను'' అనేసేవాడే. కానీ ఇప్పుడు ఆమె మూడ్‌ని పాడు చెయ్యడం ఇష్టం లేక బయలుదేరాడు.

సంధ్య చీకట్లలో చల్లగాలుల మధ్య అలా బయట తిరిగి రావడం ఆహ్లాదంగా అనిపించింది ఇద్దరికీ. దారిలో తమ పెళ్ళినాటి సంగతులు గుర్తు చేసుకుంటూ కబుర్లు చెప్పుకున్నారు.

ఇంటికి వచ్చి ఇద్దరూ కలసి భోజనం చేసారు.

విష్ణు మనసంతా రాత్రి పంచుకోబోయే అనుభవం మీదే వుంది. అతని మనసూ శరీరం ఉరికనే తుళ్ళి పడసాగాయి.

'చక్రవర్తి ఇచ్చిన రసగుళికల్లో నిజంగానే ఏదో మహత్యం వుంది. వాడక ముందే ఇంత ప్రభావం చూపిస్తున్నాయి' అనుకున్నాడు విష్ణు.

ప్రియ వంటగది సర్దుకోవడానికి వెళ్ళగానే ఆమె చూడకుండా బీరువాలోంచి ఒక మాత్ర తీసి మింగేసాడు. ఆ మాత్ర వేసుకోగానే అతనికి చక్రవర్తి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

''గుళిక మింగిన వెంటనే తొందరపడకు.. కనీసం రెండు గంటలైతే కానీ అది తన ప్రభావాన్ని చూపించదు. ఆ రెండు గంటలూ కబుర్లతోనో సరసాలతోనో కాలక్షేపం చెయ్యి''

విష్ణు టైము చూసుకున్నాడు.

రోజూ తాము నిద్రపోయే టైమ్‌కి ఇంకా చాలా సమయం వుంది.

బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి మంచం మీద ఉతికిన దుప్పటి వేసాడు. తలగడలు అందంగా సర్దాడు. చేతిలో వీక్లీ పట్టుకుని చదువుతూ ప్రియ కోసం ఎదురు చూడసాగాడు.

ప్రియ వంట గది సర్దుకుని, నైటీ వేసుకుని వచ్చింది.

లేత గులాబీ రంగు నైటీలో ఆమె చాలా అందంగా వుంది. నైటీలోంచి కనిపిస్తున్న ఆమె అందాలు అతనికి సుపరిచితమైనవే అయినా ఆరోజు కొత్తగా కనిపిస్తున్నాయి.

''ఈ నైటీలో చాలా అందంగా వున్నావోయ్''

అన్నాడు..ఆమెని మాటల్లోకి దించకపోతే నిద్ర పోయే ప్రమాదం వుందని.

''ఏమిటివాళ తీరుబడిగా వున్నారు. ఆఫీసు పనులేం లేవా?'' అంది.

''ఎప్పుడూ చదువూ, ఉద్యోగం, ప్రమోషన్లూ...ఇదే జీవితమా? ఇవాళ అవన్నీ పక్కన పడేసి కాసేపు కబుర్లు చెప్పుకుందాం''

అతని మాటలకి ఆమె కించిత్ ఆశ్చర్యంగా చూసింది.

ఈ జీవితం పరుగుపందెంలో పడి తామిద్దరూ మనసు విప్పి మాట్లాడుకుని ఎన్నాళ్ళయిందో?

తనెప్పుడైనా ఏమైనా మాట్లాడదామని నోరు విప్పితే 'అబ్బా..పొద్దున్నుంచీ అలసిపోయాను..ఇప్పుడు కాదు తర్వాత మాట్లాడుకుందాం' అంటూ దాటేసే అతనికి ఇవాళ అంత మంచి మూడ్ రావడం సంతోషంగా అనిపించింది.

పెళ్ళయిన కొత్తలోలా అతను తనతో మాట్లాడడం, తన అందాన్ని పొగడడం ఆమెకి తెలియని సంతృప్తినివ్వసాగింది.

ఏళ్ళ తరబడి పేరుకున్న నిర్లిప్తత క్రమంగా కరుగుతున్నట్లనిపించింది.

ఇద్దరూ మాటల్లో పడి సమయాన్నే మరచిపోయారు.

కాసేపయ్యాక అతను గడియారం వంక చూడడం గమనించి ''ఇంక పడుకుందామా'' అందామె.

విష్ణు లైటార్పుతూ చెప్పాడు ''పడుకుందాం...కానీ నిద్రపోవద్దు''

★ ★ ★

విష్ణుకి ఆ రాత్రి అనుభవం అద్భుతంగా అనిపించింది. ఒక్క మాటలో చెప్పాలంటే మొదటిరాత్రికన్నా గొప్పగా అనిపించింది.

ప్రియకి కూడా అలాగే అనిపించిందని మర్నాడు ఉదయం ఆమె ముఖం చూసి గ్రహించాడు.

'రస గుళిక'కి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

ఆఫీస్‌కి వెళ్ళగానే చక్రవర్తిని పట్టుకుని ఊపెయ్యాలనుకున్నాడు. కానీ ఆఫీస్‌కి వెళ్ళాక తెలిసింది అతను రెండు రోజులు సెలవు పెట్టాడని.

బీరువాలో దాచి వుంచిన రస గుళికలు గుర్తుకు రాగా ఆరోజు కూడా ఇంటికి మల్లెపూలు తీసుకు వెళ్ళకుండా వుండలేకపోయాడు.

★ ★ ★

'ప్రియని నిద్రపోనీయకుండా ఇవాళ రెండు గంటలు కాలక్షేపం చేయడం ఎలా?' అని ఆలోచిస్తుంటే విష్ణుకి ఒక ఐడియా వచ్చింది.

ఆమె వచ్చేసరికి పెట్టెలోంచి పాత పేకల సెట్టు తీసి రెడీగా వుంచాడు.

''ఇప్పుడు అవి తీసారెందుకూ?'' ఆశ్చర్యంగా అంది ప్రియ.

''మనిద్దరం పేకాడి ఎన్నాళ్ళయిందో..రా..'' అన్నాడు ముక్కలు కలుపుతూ.

ఆమె ముఖంలో ఎన్నడూ లేనంత ఆశ్చర్యం.

అటువంటి సరదాలకి దూరమై చాలా రోజులయింది.

''పందెం లేకుండా ఆడితే బోర్ కొడుతుంది. నేనాడను బాబూ'' అందామె కవ్వింపుగా.

విష్ణు సంభ్రమంగా చూసాడామె వంక. పెళ్ళైన కొత్తలో పందెం వంక పెట్టుకుని ఆమె ఒంటిమీద దుస్తులని ఒక్కొక్కటే తొలగించడం గుర్తొచ్చింది. ఇన్నాళ్ళకి మళ్ళీ.

''ఓకే..'' అన్నాడు ఉత్సాహంగా.

టెక్నిక్ పాతదే అయినా ఆట కొత్తగా వుంది.

సరదాగా ప్రారంభమై, సిగ్గుగా కొనసాగి సరసాలతో ముగిసింది.

రెండు గంటలూ రెండు నిమిషాల్లా గడిచిపోయాయి.

ఆ రాత్రి కూడా ఇద్దరికీ మరిచిపోలేని రాత్రయింది.

★ ★ ★

చక్రవర్తి మరో రెండు రోజులు లీవ్ ఎక్స్‌టెండ్ చేసాడు.



విష్ణు ఆ రెండు రోజులూ కూడా రసగుళికల సాయంతో రసాస్వాదన చేసాడు.

సెలవు నుంచి తిరిగి వచ్చిన చక్రవర్తిని కేంటీన్‌లోకి తీసుకెళ్ళి అన్నాడు ''నీకెలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియడం లేదురా..నువ్విచ్చిన రసగుళికలవల్ల నా యవ్వనం తిరిగి వచ్చినట్లుగా వుంది''

''అయితే నువ్వు నేను చెప్పిన నియమాలన్నీ తూ చా తప్పకుండా పాటించావన్నమాట'' అన్నాడు చక్రవర్తి.

''అవును. ఆ గుళికల్లో ఏదో మహత్యం వుంది. నాకింకా అవి కావాలి. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు''

విష్ణు మాటలకి చక్రవర్తి నవ్వాడు.

''నీకో నిజం చెప్పనా. నేనిచ్చిన గుళికల్లో ఏ మహత్యం లేదు. అవి కేవలం పంచదార బిళ్ళలు మాత్రమే..అవి చేసిన పనేమి లేదు. నిజానికి మీమీద పని చేసినది నేను చెప్పిన ఆ రెండు గంటల 'వ్యవధి' మాత్రమే!''

విష్ణు నమ్మలేనట్లు చూసాడు. ''నువ్వు నమ్మలేకపోతున్నావని నాకు తెలుసు. కానీ ఇది నిజం. మీరిద్దరూ ఒకరి సమక్షంలో ఒకరు గడిపిన ఆ సమయమే మీ మనసుల్లో పేరుకుపోయిన స్తబ్దతని కరిగించి మీరిద్దరూ మళ్ళీ దగ్గరయ్యేలా చేసింది. దాంపత్య జీవితంలో శృంగారాన్ని పెంచే రసగుళిక 'సాన్నిహిత్యం' ఒక్కటే. ఆ విషయం నువ్వు తెలుసుకోవాలనే ఇలా చేసాను'' అన్నాడు చక్రవర్తి.

ఆలోచిస్తున్నకొద్దీ ఆ మాటల్లోని నిజం అర్థమవ్వసాగింది విష్ణుకి.

ఇంటికెళ్ళి బీరువాలో దాచుకున్న పంచదార బిళ్ళలని బయట పారేసాడు. కానీ రసగుళికల్లాంటి ఆ మాటలని మాత్రం హృదయంలోనే దాచుకున్నాడు.

☆

## ఆసక్తి

**సినీతారల వైవాహిక జీవితం గురించి జనం ఎంతో ఆసక్తి కనబరుస్తుంటారు. ఎందుకంటే సినిమాల్లో వారి ప్రవర్తనకి, నిత్యజీవితంలో వారి ప్రవర్తనని పోల్చి చూస్తారు. ఇప్పుడు సయీఫ్ అలీఖాన్ పరిస్థితి అలాగే ఉంది. భార్య అమృతాసింగ్‌తో తెగతెంపులు చేసుకుని ఓ ఇటాలియన్ అమ్మాయిని పెళ్లాడబోతున్నట్టు భోగట్టా. అన్నట్టు ఇటాలియన్ భామతో కలిసి సయీఫ్ యుకె, యుఎస్‌లో పలు స్టేజ్‌షోలలో పాల్గొంటున్నాడు.**